క్లుప్తంగా

కార్మెల్‌మాతను దర్శించుకున్న భక్తులు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని కార్మెల్‌కొండపైనున్న కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయాన్నే మిర్యాలగూడ, ధర్మవరం, కర్నూలు, ప్రాంత్రాల నుంచి బస్సుల్లో భక్తులు తరలివచ్చారు. మెట్లమార్గం ద్వారా కొండను ఎక్కి తలనీలాలు సమర్పించి కొవ్వొత్తులు వెలిగించి , కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్మెల్ మాతను దర్శించుకొని ప్రార్థనలు చేశారు.

ప్రమాదకరంగా కల్వర్టు



ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరులోని కాలువపై ఏర్పాటు చేసిన కల్వర్టు ఒక వైపు పగిలి గుంత ఏర్పడి ప్రమాద కరంగా మారింది. గ్రామ ప్రధానరహదారిపై ఉండటంతో ఆ వైపుగా వాహనాలు వెల్లాలంటే ప్రమాదకరంగా ఉందని వాహనదారులు భయపడుతున్నారు. కొత్తగా గ్రామానికి వచ్చేవారు ప్రమాదవశాత్తు గుంతలో వాహనం పడి క్షతగాత్రులైనవారు ఉన్నారు. గుంతను పూడ్చించివేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

బోరుకు మరమ్మతులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో హిందూ శ్మశాన వాటిక బోరుకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. గత కొంతకాలం నుంచి బోరు పనిచేయకపోవడంతో ఉండవల్లి సచివాలయం–2లో స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు.

220 మందికి వైద్యపరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరాన్ని వైస్ ఎంపీపీ మార్పుల విజయలక్ష్మి, సర్పంచి ఎం.విజయలక్ష్మి ప్రారంభించారు. గీతామల్టీ స్పెషాలిటీ వైద్యశాల(సత్తెనపల్లి) సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 220 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మార్పుల శివరామిరెడ్డి, ఈశ్వరరెడ్డి, వైద్యులు గీతాహసంతి, రాజమోహన్‌రెడ్డి, అనిత, భవ్యారెడ్డి పాల్గొన్నారు.

దళితులకు బేషరతుగా చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

మేడికొండూరు: దళితులకు చంద్రబాబు నాయుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎంపీపీ మన్నవ స్వప్న, పార్టీ నాయకుడు రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. బాబు దళిత వ్యతిరేకిగా పేర్కొన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. మంత్రి క్యాంపు కార్యాలయంపై చంద్రబాబు తన అనుచరులతో ముందస్తు పథకంలో భాగాంగానే రాళ్ల రువ్వారని అన్నారు. చంద్రబాబు ఆది నుంచి దళితులను చులకనగా, హేళనగా, అవమానించే విధంగా మాట్లాడటం అలవాటుగా మారిందని పేర్కొన్నారు.

124 సీసాల మద్యం ధ్వంసం



తాడికొండ: తాడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను ఆదివారం సీఐ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు డీఎస్పీ వి.పోతురాజు ఆధ్వర్యంలో 124 మద్యం సీసాలు ధ్వంసం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జున పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్'

మంగళగిరి: నగరంలోని ఆయా వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. నగర పరిధిలోని 8, 15, 16 సచివాలయాల పరిధితో పాటు వార్డుల్లో మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించిన నాయకులు,కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజా మద్ధతుపై సర్వే నిర్వహించారు. ఆత్మకూరు, నిడమర్రు, నవులూరు, యర్రబాలెం, కురగల్లు, చినకాకాని, పెదవడ్లపూడిలో నిర్వహించిన కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొప్పురావు కాలనీలో శరవేగంగా జరుగుతున్న పైపులైను పనులు

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శర వేగంగా సాగుతున్నాయి. అందరికీ తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల నిర్మాణం చేపట్టారు. శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ఆర్కే చొరవతో పనులు కొనసాగుతున్నాయి.

ఇదిగిదిగో.. అభివృద్ధి

- నగరానికి శాశ్వత తాగునీటి పరిష్కారం
- శరవేగంగా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే ఆర్కే ప్రత్యేక చొరవ

మంగళగిరి: నగరానికి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కానుంది. మంగళగిరి–తాడేపల్లి నగర ప్రజల భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.221.53 కోట్లతో చేపట్టిన తాగునీటి పథకం నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 2050 నాటికి నగరం విస్తరించనున్న నేపథ్యంలో పెరగనున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) నిధులతో పథకాన్ని చేపట్టారు. నగరంలో విలీనమైన గ్రామాలను సైతం కలుపుకుని 327 కిలో మీటర్ల పైపులైను నిర్మాణం చేపట్టాగా నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. తాగునీటి పథకం పూర్తయ్యే లోగా నగర ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా గుంటూరు చానల్ వద్ద మరో సంపుతో పాటు నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి నగరంలోని కొప్పురావుకాలనీ ఓవర్‌హెడ్ ట్యాంకుకు తరలించి తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

శ్మశాన వాటికలపై శ్రద్ధ

నగర పరిధిలోని పాత మంగళగిరి, పెదవడ్లపూడిలోని స్మశాన వాటికల అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. పాత మంగళగిరిలోని ఎస్సీ, హిందూ శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు గ్రావెల్ లెవలింగ్, అంత్యక్రియలు, కర్మకాండలకు మౌలిక వసతుల ఏర్పాటు, విద్యుత్, తాగునీటి సదుపాయంతో రూ.26 లక్షలతో చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆదివారం జంగిల్ క్లియరెన్స్ నిర్వహించి గ్రావెల్ లెవలింగ్ పనులు చేపట్టారు.

తీరనున్న తాడేపల్లి కష్టాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కొత్తూరు, పాతూరు ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలు అందించేందుకు చకచకా పనులు జరుగుతున్నాయి. ఆదివారం ఎంటీఎంసీ అధికారులు కొత్తూరు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద ప్రెజర్ సాండ్ ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేశారు. ఏఈ ప్రవీణ్ మాట్లాడుతూ గంటకు లక్షా 50 వేల లీటర్ల నీటిని శుద్ధిచేసి అందించే రెండు ప్రెజర్ సాండ్ ఫిల్టర్లను బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఏర్పాటు చేశామని, నేరుగా బకింగ్‌హామ్ కెనాల్ నుంచి రావాటర్‌ను తీసుకుని ప్రత్యేక పద్ధతిలో శుద్ధిచేసి నేరుగా ప్రజలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.



బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఏర్పాటు చేసిన ప్రజర్‌శాండ్ ఫిల్టర్ బెడ్‌లు

తుది దశకు చేరాయి



ఏఐఐబీ నిధులతో చేపట్టిన తాగునీటి పథకంలో పైపులైను పనులు తుది దశకు చేరాయి. మిగిలిన పనులు త్వరలోనే పూర్తి చేసి నగర వాసులకు 24 గంటలు తాగునీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో ఎంటీఎంసీ మరింత విస్తరించనున్న నేపథ్యంలో పెరగనున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని తాగునీటి పథకం రూపొందించడం జరిగింది.

ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే

రూరల్ స్టేషన్‌లో గంజాయి బస్తా మాయం!

- ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టుకున్న పట్టణ పోలీసులు
- పరారీలో నిందితుడు
- గోప్యంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మంగళగిరి: మంగళగిరి రూరల్ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్ల బస్తా చోరీకి గురైనట్లు సమాచారం. గంజాయి అక్రమ రవాణా జరుగుతుండగా పట్టుకున్న గంజాయిని పోలీసులు పై అంతస్తులోని గదిలో నిల్వ ఉంచుతారు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి దాటిన అనంతరం సుమారు 2 గంటల సమయంలో ఓ దుండగుడు గంజాయి బస్తాతో ఉడాయించాడు. ఇంతలో పట్టణ పోలీసులు రాత్రి గస్తీ తిరుగుతున్న సమయంలో మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని గంజాయి బస్తాను అక్కడ వదిలి పారిపోయాడు. బస్టాండ్‌లో అనుమానాస్పదంగా ఓ బస్తాను గమనించిన ఆర్టీసీ అధికారులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ అంకమ్మరావు 18 కిలోల బరువుగల గంజాయి బస్తాను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. బస్తాపై 12 అని నంబరు రాసి రౌండ్ చుట్టి ఉండటంతో బస్తా ఎక్కడి నుంచి తీసుకువచ్చారనే దానిపై పోలీసులు గోప్యంగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. రూరల్ స్టేషన్‌లో చోరీకి గురైన గంజాయి బస్తాను పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పలువురు సిబ్బంది చర్చించుకుంటున్నారు. పోలీసులు స్టేషన్‌లో ఉండగానే గంజాయి బస్తా చోరీకి గురి కావడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత ఆరు నెలల క్రితం ఇదే విధంగా గంజాయి బస్తాను ఓ దుండగుడు తీసుకుని పారిపోతుండగా పోలీసులు వెంబడించినా ఫలితం లేకుండా పోయిన ఘటన మరువకముందే మరో ఘటన చోటు చేసుకోవడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. గంజాయి అక్రమ రవాణా చేసే సమయంలో సరఫరా దారులు పకడ్బందీగా ప్యాకింగ్ చేసి అనుమానం రాకుండా తరలిస్తారు. పట్టణ పోలీసులకు దొరికిన బస్తా సిమెంటు గోతంలా ఉంది. గోతంపై నంబర్లు రాసి ఉండటం రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి గంజాయి బస్తా చోరీకి గురైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మరి కొన్ని బస్తాలను వేరే స్టేషన్‌కు తరలించేందుకు పోలీస్ వాహనంలో ఎక్కించడం పలు అనుమానాలకు తావిస్తుంది. విషయం బయటకు రాకుండా అధికారులు విచారణ చేపట్టి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై రూరల్ సీఐ భూషణంను వివరణ కోరగా అలాంటి ఘటన చోటు చేసుకోలేదని తెలిపారు. అధికారులు, సిబ్బంది స్టేషన్ విధుల్లో ఉండగా గంజాయి బస్తా చోరీకి గురి కావడం జరిగే అవకాశం లేదన్నారు.



పట్టణ పోలీస్ స్టేషన్‌లో గంజాయి బస్తా

ఎమ్మెల్యే ఆర్కేపై అసత్య ఆరోపణలు తగదు

తాడేపల్లి రూరల్: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)పై టీడీపీ నేతల అసత్య ఆరోపణలు తగదని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అక్రమంగా గ్రావెల్ తరలించి అవినీతికి పాల్పడినట్లు అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

నేడు వలంటీర్లు, గృహసారథుల సమావేశం

మంగళగిరి: నగరంలోని ఆటోనగర్ ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు వలంటీర్లు, గృహసారథులు, వార్డు కన్వీనర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పలువురు నాయకులు హాజరు కానున్నారని, వలంటీర్లు, గృహసారథులు, వార్డు కన్వీనర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గౌరీశంకర నాట్యమండలి రజతోత్సవం

బాపట్ల: స్థానిక సోమేశ్వర స్వామి ప్రాంగణంలో శ్రీ గౌరీ శంకర నాట్యమండలి స్థాపించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం రజతోత్సవం నిర్వహించారు. సభలో ప్రఖ్యాత రంగస్థలం నటుడు కేఎస్‌టీ సాయి మాట్లాడుతూ.. సంస్థ నిర్వాహకుడు, ప్రముఖ రంగస్థల నటుడు మల్లికార్జునరావు ప్రతి వార్షికోత్సవం సందర్భంగా ఇద్దరు ప్రముఖ రంగస్థలం నటులను సన్మానిస్తున్నారని తెలిపారు. కళాకారులకు నూతన ఉత్సాహం కల్పిస్తూ రంగస్థలం నాటకాలపై అభిరుచి కలిగిస్తుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్, నంది అవార్డు గ్రహీత డాక్టర్ పీవీ రామకుమార్, బాపట్ల రంగస్థలం పుస్తక రచయిత, రంగస్థలం కళాకారుడు మన్నే శ్రీనివాసరావును సంస్థ ఘనంగా సన్మానించింది. దుర్యోధన మయసభ, శ్రీకృష్ణ రాయబారం నాటకం నుంచి సెంట్రల్ సీను ప్రదర్శించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నిభానపూడి హరి ప్రసాద్, ఎస్వీఆర్ కుమార్, ఎస్వీఆర్ రాజేశ్వర శర్మ, బందా బాబు, నందనవనం శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంట కాలువలకు మరమ్మతులు చేపట్టాలి

తాడేపల్లి రూరల్: పంట కాలువకు మరమ్మతులు చేసి సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలోని ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌ను రైతు సంఘం నాయకులతో కలసి ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ నుంచి ప్రాతూరు, చిర్రావూరు, రామచంద్రపాలెం వరకు సుమారు 3,600 ఎకరాలకు నీరు అందించిన పంట కాలువ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెత్తాచెదారంతో పూడుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కుంచనపల్లి పరిసర ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలతో వాటి నుంచి వ్యర్థాలతో నీరు బయటకు పోయే దారి లేక పంట కాలువలలో పెట్టడం దుర్మార్గమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పలుమార్లు అధికారులను కలసి రైతుల సమస్యను విన్నవించినా కూడా అధికారులు స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు, కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు, నాయకులు అమ్మిశెట్టి రామారావు పాల్గొన్నారు.




ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వద్ద పంట కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చంద్ర బాబును అరెస్టు చేయాలి

జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి

తాడికొండ: ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో దళిత మంత్రి ఇంటిపై, పలువురు దళిత నాయకులపై దాడి ఘటనలో చంద్రబాబును అరెస్టు చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి డిమాండ్ చేశారు. తాడికొండ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయంగా తనను ఎవరూ నమ్మడం లేదని గ్రహించిన చంద్రబాబు కులమతాలు, దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధిపొందాలని యత్నిస్తున్నారని ఆరోపించారు. దళితులను హేళనగా మాట్లాడిన చంద్రబాబును క్షమాపణ చెప్పాలని కోరినందుకే దళిత మంత్రి ఇంటిపై బాబు దాడి చేయించారని చెప్పారు. విలేకరుల సమావేశంలో తాడికొండ, నిడుముక్కల సర్పంచులు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడపాటి ధర్మరాజు, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి బాకి వెంకటస్వామి, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి తోకల నరసింహారావు, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, ఎంపీటీసీ పాలడుగు దాసు, మాజీ ఉప సర్పంచి మాదాసు ఏసురత్నం పాల్గొన్నారు.



సూర్యలంక జన సంద్రం

పోటెత్తిన భక్త జన సంద్రంతో.. ఉప్పొంగిన సూర్యలంక సముద్రతీరం. తొలి పొద్దు వెచ్చని కిరణాలతో వికసించిన సంతోషాలు. కడలి కెరటాల స్పర్శతో తీరంలో కేరింతలు.. రంజాన్ అనంతరం ముస్లింలు ఆదివారం సముద్ర తీరానికి చేరుకున్నారు. తమ కుటుంబంతో సంతోషంగా గడిపారు. లక్ష మందికి పైగా భక్తుల రాకతో సూర్యలంక తీరం..మరో సంద్రంగా మారింది.

-బాపట్ల అర్బన్

దళితులు క్షమాపణ కోరితే దాడులా!

- చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు
- వైఎస్సార్ సీపీ నాయకుడు కత్తెర సురేష్‌కుమార్



తాడికొండ: దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు క్షమాపణ చెప్పమని అడిగితే కార్యకర్తలతో దాడులు చేయిస్తావా అని నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో మంత్రి ఆదిమూలపు సురేష్ ఇల్లు, కార్యకర్తలపై రాళ్లదాడి చేయడంపై స్పందించిన ఆయన బాబుకు తొలి నుంచి దళితులంటే అలుసని, దళితుడిగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అనే వ్యాఖ్యలు చేసి కించపరిచాడని మండిపడ్డారు. దళితులపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన బాబును క్షమాపణ చెప్పమని కోరినందుకు బాబు డైవర్షన్ పాలిటిక్స్‌తో మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటిపై దాడి చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత మంత్రి ఇంటిపై దాడులు చేసేందుకు తన సామాజిక వర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకుడు డాక్టర్ మన్నే రవీంద్ర అనుచరులతో కలిసి ఇంటి పక్కనే నక్కి చేసిన ఘటన వీడియోలు బయటకు రావడంతో ఇంగుతిన్న బాబు దీనిపై మారు మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. బాబుకు తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు.

26న త్యాగరాజస్వామి జయంతి ఉత్సవాలు

తెనాలి: వేమూరు మండల గ్రామం పెరవలిలో ఈ నెల 26న సద్గురు శ్రీ త్యాగరాజస్వామి 256వ జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్‌తో కలిపి పెరవలిలోని భక్తరామదాస–సద్గురు శ్రీత్యాగరాజు సంగీత మహోత్సవ సమాఖ్య నిర్వహణలో ఈ ఉత్సవాలు జరగనున్నాయి. స్థానిక గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం సమాఖ్య వ్యవస్థాపకుడు, సంగీత విద్వాంసుడు తాడేపల్లి లోకనాథశర్మ విలేకరులకు వివరాలు వెల్లడించారు. పెరవలిలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 60 మంది సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామి కృతులను గానం చేస్తారు. మృదంగం, వయొలిన్ వంటి వాద్యాల సహకారం లేకుండా కేవలం భక్తి ప్రధానంగానే ఈ సంగీత యజ్ఞం జరుగుతుందని లోకనాథశర్మ వెల్లడించారు. 11.30 గంటలకు జరిగే సభలో విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎంవీఎస్ ప్రసాద్, ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మల్లాది సూరిబాబు, దూరదర్శన్ కేంద్రం, విజయవాడ ప్రోగ్రాం అధిపతి డాక్టర్ వసుమతి రాజన్, తిరుపతిలోని శ్రీత్యాగరాజస్వామి ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కేవీ మోహన సుందరం, విశాఖలోని శ్రీవాగ్దేవి కళాపీఠం వ్యవస్థాపకుడు వీవీఎల్ శ్రీనివాసమూర్తి, ప్రముఖ సినీనటి, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజుభార్గవి, వంశీ రామరాజు, సర్పంచ్ దాది వెంకట లక్ష్మీరాజ్యం పాల్గొంటారని తెలిపారు. ఇదే సభలో సద్గురు త్యాగరాజ జయంతి అవార్డు–2023ను చావలి రాధాకృష్ణమూర్తికి ప్రదానం చేయనున్నట్టు వివరించారు. మృత్యుంజయశర్మ, తాడేపల్లి ఆంజనేయశాస్త్రి, తాడేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, తాడేపల్లి శ్రీధర్, జోస్యుల శ్యామలాదేవి, టీవీఎస్ శాస్త్రి ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న లోకనాథశర్మ

చర్చికి రూ.లక్ష విరాళం

కొల్లిపర: కొల్లిపర గ్రామం ఎస్సీ కాలనీలోని లూథరన్ చర్చి ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ చిలువూరి ఝాన్సీ, మాజీ ఎంపీటీసీ భీమవరపు సంజీవరెడ్డి, తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ జొన్నల శివారెడ్డి, రెవ పాస్టర్ సుమన్‌బాబు, సంఘ పెద్దలు కె.బాస్కరావు, ఎ.రామరావు, జి.శాంతి రాజు, మంద్రు రాజు, పిల్లి గంగాధర్, దేవ దత్తు, వైఎస్సార్ సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



నగదు చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా దంపతులు

అంబేడ్కర్ భావజాలంతో యువత పురోగమించాలి

కాంస్య విగ్రహ భూమి పూజలో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నేటి యువతరం ముందుకు సాగాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. పట్టణంలోని చినరావూరు తోట మదర్ థెరిస్సా నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న తొమ్మిది అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ భూమి పూజలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగ విలువలను అందరూ పాటించాలన్నారు. అంబేడ్కర్ భావజాలాన్ని, ఆయన సూక్తులను పాటిస్తూ యువతరం పురోగమించాలని పేర్కొన్నారు. తెనాలిలో తొమ్మిది అడుగుల భారీ కాంస్య విగ్రహం ముదావహమన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, త్వరలోనే విగ్రహావిష్కరణ చేయాలని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు రాజ్యాంగం రచించిన అంబేడ్కర్ మహనీయులన్నారు. వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు కుర్రా సుజాత, కొర్రా యశోద, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్ మాట్లాడారు. 14వ వార్డు కౌన్సిలరు దాసరి వీరవసంతరావు మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కన్నెగంటి రమేష్, గొల్ల మాణిక్యరావు, పీసీహెచ్ వెంకయ్య, పెనుమాక మోహన్‌రావు, కర్ర రాజారత్నం, బోరుగడ్డ సురేష్, దాసరి శ్రీధర్, ఉన్నవ సల్మాన్, కన్నెగంటి తేజ, దమ్ము స్టాలిన్, మురారి థామస్, ప్రకాష్, అంబేడ్కర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భూమి పూజలో ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక



తెనాలి: ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పద్మశాలీయ వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. వధువరుల పరిచయ కార్యక్రమానికి 300 దరఖాస్తులు వచ్చాయి. సభకు సొసైటీ సభ్యుడు నరసింహరావు అధ్యక్షత వహించారు. తల్లిదండ్రులతోపాటు వధువు/వరుడు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. డాక్టర్ పురుషోత్తమరావు వివాహ పరిచయ పుస్తకాలను ఆవిష్కరించారు. అక్కల శ్రీరామ్, దివి పురుషోత్తం, టీవీ కృష్ణారావు, జె.మహేష్, ఆర్.శ్రీనివాసరావు, కటకం గిరి, దామర్ల పరమేశ్వరరావు, గంజి ప్రభాకరరావు, పంచుమర్తి భాస్కర్ పాల్గొన్నారు.